# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [3]

~ అద్దంకి అనంత రామయ్య



**సీరియల్:** సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [3]

**రచన:** అద్దంకి అనంత రామయ్య

**ప్రచురణ:** కినిగె పత్రిక patrika.kinige.com

**కాలం:** జనవరి 2014

**శాశ్వత లింకు:** http://patrika.kinige.com/?p=966

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [3]

*అత్యధికంగా అమ్ముడుపోయిన ఈ-పుస్తకంగా పేరు తెచ్చుకున్న "రామ్@శృతి.కామ్" రచయిత అద్దంకి అనంతరామయ్య రాసిన రెండవ హాస్య నవల ఈ "సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం". దీన్ని వారం వారం సీరియలైజ్ చేస్తున్నాం.* ***ఇది మూడవ భాగం.***

దీని ముందుభాగం

మానేజరు గొడవతో మనస్సు బాగోక, అనుకున్నట్టుగానే అద్దంకి పయనం అయ్యాడు. తాను అరగంట ముందుగా వస్తే తన బస్సు రావాల్సిన సమయానికన్నా గంట ఆలస్యం అని చెప్పటంతో, చేసేది ఏమి లేక, వచ్చి పోయే బస్సులను లెక్కేస్తూ నిలబడ్డాడు. "బస్ స్టాప్ లోనే ఉన్నా డాడీ! బస్సు గంట ఆలస్యం అట, అది వచ్చాక చేస్తాను" అని ఫోనులో మాట్లాడుతున్న ఒక అందమైన అమ్మాయి అజయ్ కంట పడింది. ఆసక్తిగా అజయ్ ఒక చెవి అటు వైపు వేసాడు. "ఏ విషయం మెయిల్ చేస్తామని చెప్పాడు. నేనైతే బాగానే చేశాను" అని వినపడింది. ఇంజనీరింగ్ అయిపోయి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నదన్న విషయం అర్థమైంది అజయ్ కి. "ఉద్యోగం వచ్చేదాకా, అది రాలేదన్న బాధ మాత్రమే ఉంటుంది. వచ్చాక అస్సలు బాధలు మొదలవుతాయి" అని మనసులో అనుకున్నాడు అజయ్.

ఆ అమ్మాయిని పైనుండి కింద దాక తన కళ్ళతో స్కాన్ చేయటం మొదలు పెట్టాడు. "ఇప్పుడే షోరూమ్ నుండి వచ్చిన వోల్వో బస్సులాగుంది" అనుకున్నాడు. పోలిక బాగోలేకపోయినా అమ్మాయి బాగుందన్న విషయం అర్థం అవ్వాలి. అజయ్ తనని చూడటం ఆ అమ్మాయి కూడా గమనించింది, అజయ్ ని తిరిగి చూడటం మొదలు పెట్టింది . "టైం బాగలేనప్పుడు కూడా మన టైమింగ్ బాగానే ఉన్నదే" అని మనసులో అనుకున్నాడు. కాసేపటికి ఆ అమ్మాయి అజయ్ దగ్గరకి వచ్చి "మీరు అజయ్ కదా! నా పేరు లావణ్య గుర్తుపట్టారా?" అన్నది. ఆశ్చర్యంతో "ఇందాకటి నుండి అదే చూస్తున్నా ఎక్కడో చూసినట్టున్నది, గుర్తుకు రావటం లేదు" అన్నాడు. "మీరు R N E C కాలేజీలో మాకు

సీనియర్ సార్. మాకు మీరు క్యాంపస్ ట్రైనింగ్ కూడా ఇచ్చారు" అన్నది, అజయ్ ఆశ్చర్యానికి తెర దించుతూ.

"అదీ సంగతి! మనదగ్గర ట్రైనింగ్ తీసుకున్నాక ఇంక ఉద్యోగం ఏమొస్తుంది?" అని మనస్సులో అనుకొని, "ఓ నైస్ , ఏమి చేస్తున్నావు ఇప్పుడు?" అని అడిగాడు. " క్యాంపస్ లో జాబ్ రాలేదు మీకు లాగా, అందుకని జాబ్ ట్రై చేస్తున్నా?" అన్నది. "ఇంకా ముత్యం కంపెనీలోనే చేస్తున్నారా మీరు?" అని అడిగింది. "అవును అక్కడే చేస్తున్నాను" అన్నాడు అజయ్. "హే, నిషా అక్క ఎలా ఉన్నది? ఎప్పుడు మీ పెళ్లి, ఆల్రెడీ చేసేసుకున్నారా?" అని అడిగింది, అందమైన తనకళ్ళను పెద్దవి చేస్తూ. " తను బాగానే ఉన్నది. పెళ్లి గురించి ఇంకా ఏమి అనుకోలేదు" అన్నాడు. ఈలోగా నిషా ఫోన్ చేసింది, బస్సు ఎక్కావా?" అని . తన బస్సు ఆలస్యం అయిన సంగతి, లావణ్య పరిచయం అయిన సంగతి వివరించాడు. నిషా కూడా లావణ్య తో మాట్లాడింది. ఇంతలో బస్సు కుడా రానే వచ్చింది. ఇద్దరిదీ ఒకే బస్సు. అజయ్ ఎడమ వరుసలో, సరిగ్గా అదే వైపు కుడి వరసలో లావణ్య కూర్చున్నారు. తెల్లవార్లూ ముచ్చట్లతోనే సరిపోయింది. ఫోను నెంబర్లులు తీసుకోవటం, ఫేసుబుక్కులో కూడుకోవటం టక టక జరిగిపోయాయి. ఏమాటకామాట ఒక స్మార్ట్ ఫోన్, దానిలో ఇంటర్నెట్ ఉంటే ప్రపంచం మన చేతుల్లో ఉన్న భావన కలుగుతుంది. తెల్లవారుఝామున అజయ్ అద్దంకిలో దిగాడు. లావణ్య వాళ్ళ ఊరు వెళ్ళిపోయింది.

అద్దంకి అటు పట్టణం కాదు , ఇటు పల్లెటూరు కాదు . నాలుగు సినిమా హాళ్ళు ,రెండు డిగ్రీ కాలేజీలు, అరడజను ఇంటర్నెట్ పాయింట్లు, డజను మెడికల్ షాప్ లు ,ఒక పోలీస్ స్టేషన్ , పది మంది పోలీసులు. క్లుప్తంగా, ఇది ఆ ఊరు పరిస్థితి. స్టేషన్, పోలీసులని మొదలయ్యిందని ఇదేదో రక్తపు కథ అనుకునేరు . దేవుడి దయ వల్ల ఇంకా అంత హింస ఊరిని తాకలేదు .

అజయ్ ఎక్కువగా బయటి ఊర్లలోనే చదవటంతో, ఆ ఊర్లో తనకున్న మిత్రులు అందరూ బాల్య మిత్రులే. తన బాల్య స్నేహితులందరిలోకీ ఎక్కువ చదువుకున్నది అజయ్ మాత్రమే. కొంతమంది

వ్యాపారాల్లోను, వ్యవసాయంలోను, స్థిరపడాల్సి రావటంతో చదువుకోలేదు. కొంతమంది సరిగా చదువుకోకపోవటంవల్ల వ్యాపారాల్లోకి రావాల్సి వచ్చింది. చదువుకోకపోయినా అజయ్ కన్నా ఎక్కువగానే సంపాదించగలుగుతున్నారు.

రియల్ ఎస్టేట్ అన్న పేరుతో భూమి ధరకు రెక్కలు రావటంతో, ఆ రెక్కలు పట్టుకొని బాగానే గడించారు. అజయ్ నాన్నగారు బ్యాంక్ లో ఆఫీసర్. ఒక్కగానొక్క కొడుకు కావటంతో, అజయ్ ఇంట్లో కన్నా బజారులోనే ఎక్కువ సమయం గడుపుతుంటాడు. బాల్య స్నేహితులంతా కలిసి బజార్ల వెంట తిరుగుతుంటే, ఆ బజారులకే కళ వచ్చేది.

ఊరికి నడిమధ్యలో పెద్ద సిమెంటు రోడ్డు, ఆ రోడ్డుకి ఇరువైపులా చెట్లు నాటించటం అశోకుడు మర్చిపోయాడేమో, అందుకే వాటి స్థానం లో వాణిజ్య సముదాయాలు ఏర్పడ్డాయి. చుట్టుప్రక్కల పల్లెటూర్లు చాలా వరకు ఆ బజారునే ఆశ్రయించి ఉండటంతో, అది ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది.అదే బజారు లో అజయ్ చిన్ననాటి మిత్రుడు CM ,బట్టల వ్యాపారం చేస్తుంటాడు. CM అంటే ఏ రాష్ట్రానికో అనే అనుమానం రాక మానదు. రంగు రంగు బట్టలతో తప్ప రాజకీయాలతో ఇతనికి సంభందం లేదు. వస్త్ర వ్యాపారి గనుక, ఆంగ్లంలో క్లాత్ మర్చెంట్ అనే పదాలలో మొదటి రెండక్షరాలని కలిపి CM అని పిలుస్తుంటారు.

CM అసలి పేరు శ్రీనివాస గుప్త. చిత్రగుప్తుడు అందరి తప్పులు రాస్తే, ఈ గుప్తుడు అందరి అప్పులు రాస్తుంటాడు. వీళ్ళ మిత్ర బృందం లో ఎవరికి డబ్బు అవసరం వచ్చినా మొదట గుర్తుకు వచ్చేది గుప్తుడే. ఇంటర్ వరకూ ఇరగదీసి చదివాడు. కాని వ్యాపారం చేయాలని ఇంట్లో పట్టు పట్టటంతో, చేసేది లేక పరీక్షలు రాయటం మానేసి పద్దులు రాయటం మొదలు పెట్టాడు, అలా రాస్తూనే ఉండిపోయాడు. బాల్యమిత్రులకి తప్పించి సొంత బాబాయికైనా వడ్డీ లేనిదే డబ్బు ఇవ్వడు. వస్త్ర వ్యాపారనికే పరిమితం కాకుండా, భూ క్రయ విక్రయాలు, షేర్లు, ఇలా పలు రకాలుగా సంపాదిస్తున్నాడు. దాదాపు అన్ని బ్యాంకులలో ఖాతాలలో పాటు వాటిల్లో డబ్బులు కూడా ఉన్నాయి.

ఈ బాల్యమిత్రులందరికీ దాదాపు పదేళ్లుగా ఈ గుప్తుడి వస్త్ర దుకాణమే విశ్రాంతి భవనంగా పని చేస్తున్నది.

రాత్రంతా లావణ్య తో పులిహోర కలిపి.. కలిపి.. అలసిపోవటంతో, ఇంటికి చేరి చేరగానే మంచం ఎక్కి నిద్రపోయాడు. మధ్యాహ్నానికి నిద్ర లేచి స్నానం చేసి రెండు ముద్దలు తిని, టి.వి ముందు కూర్చున్నాడు. "చితక్కొట్టు చీరపట్టు" లాంటి కార్యక్రమాలు వస్తున్నాయి. "ఏంటి నాన్న, కనీసం వస్తున్నట్టు చెప్పనైనా లేదు, అది కూడా వారం మధ్యలో, ఏదైనా పనుందా?" అని అడిగింది అజయ్ అమ్మగారు, మజ్జిగ కలిపిన గ్లాసు అజయ్ చేతికి అందిస్తూ. "అవునమ్మా, స్నేహితుడు ఒకడు అమెరికా నుంచి వచ్చాడు. వాడిని కలవటానికి వచ్చాను. వాడుకోవాల్సిన సెలవులు కూడా చాలా ఉండిపోయాయి" అని తడుముకోకుండా అబద్దం చెప్పేశాడు. ఈ సాఫ్ట్ వేర్ కంపెనీలలో ఆ మాత్రం అబద్దాలు ఆడగలిగితే తప్ప బతకలేమని అలా అలవాటు చేసుకున్నాడు అజయ్. ఆ మజ్జిగ తాగి బజారున పడ్డాడు.

సరదాగా CM దగ్గరకు వెళ్ళాడు. అజయ్ ని దూరం నుంచే చూసి ఆశ్చర్యపోయాడు. తన దగ్గర పని చేసే కుర్రవాడిని కుర్చీ వేయమని పురమాయించాడు. ఊరు మొత్తానికి అదే పెద్ద బట్టలకొట్టు. రెండంతస్తులలో విశాలమైన భవనం లో ఉన్నది. " ఏరా, సాఫ్ట్ వేరోళ్ళకి వారానికి నాలుగు రోజులు సెలవులు చేసారా ఏంటి? శని , ఆదివారాలు చాలటం లేదా ?" అని నవ్వుతూ అజయ్ కోసం వేయించిన కుర్చీని చూపించాడు , కూర్చోమన్నట్టు. "అవునురా ! జీతం చాలటం లేదు. మూడురోజులు ఉద్యోగం మిగిలిన నాలుగు రోజులు వ్యాపారం చేసుకోమని పంపారు.కొట్లో కుర్రాళ్ళు తగ్గితే చెప్పు" అన్నాడు అజయ్ వెటకారంగా. " మీలాంటి వాళ్ళని పనిలో పెట్టుకుంటే కానీ, నేను వ్యాపారం మానేసి ఇంట్లో కూర్చోనూ ! అంత అదృష్టం మాకొద్దులే" అన్నాడు కాస్త వ్యంగ్యంగా. "అదేరా నువ్వు వ్యాపారం మానేసి ఇంట్లో కూర్చున్నా నీకు గడిచిపోతుంది. నాకు అలా కాదు కదా! వేళ్ళు ఆడితే కాని డొక్కాడని పరిస్థితి" అనటంతో అర్థం కానట్టు ముఖం పెట్టాడు గుప్తా. అదేరా వేళ్ళతో కంప్యూటర్ ఆడిస్తే కానీ కడుపు నిండదు అని చెప్తున్నా" అన్నాడు అజయ్. "మీ చదువుకున్న వాళ్ళతో

ఇదేరా బాబు ఇబ్బంది. జోక్ అని మీరు చెప్తే కానీ అర్థం కాదు, నవ్వు రాదు. వీలు చూసుకొని నవ్వుతాలే కాని ఏంటి విశేషాలు?" అంటూ కబుర్లలో మునిగిపోయారు.

సాయంత్రం నాలుగు గంటల సమయంలో గుమాస్తాని కొట్టు చూసుకోమని చెప్పి ఇద్దరూ బయటకు బయలుదేరారు. ఊరికి ఆధారమైన గుండ్లకమ్మ నది ఒడ్డున పొలాల వైపు బండిని నడిపాడు అజయ్. ఊరికి దూరంగా, నదికి దగ్గరగా పొలం, ఆ పొలం మధ్యలో ఒక పెంకు పంచ, దాని చుట్టూ రకరకాల కూరగాయల మొక్కలు. ఆ పొలం గట్టున బండి ఆపి , ఇద్దరూ ఆ ఇంటి వైపు నడిచారు. పంచ బయట వేసి ఉన్న నులక మంచం మీద కూర్చొని అజయ్ సిగిరెట్ వెలిగించాడు. ఆ ప్రకృతిని ఆస్వాదిస్తున్నాడు. "సంక్రాంతికి రావాల్సిన పంట, ముందుగా శ్రీరామనవమికే వచ్చేసిందే" అంటూ పొలంలో నుంచి బయటకు వచ్చాడు దాత. "నీ బొందరా ! శ్రీరామ నవమి కన్నా ముందే సంక్రాంతి వస్తుంది" అన్నాడు అజయ్. "మమ్మల్ని కూడా నీలాగా ఇంజనీరింగ్ చదివిస్తే తెలిసేది, ఏది ముందు వస్తుందో? పొలం చేసే వాడికేమి తెలుస్తుంది పండగల గురించి., ఏదో వైన్ షాపు లో విస్కీ లాంటోళ్ళం" అన్నాడు దాత. అదేమి దిక్కుమాలిన పోలికన్నట్టు ఇద్దరూ చూసారు. "బావిలో కప్పలాగా అంటే బాగోలేదనిపించి" అనటంతో ఇద్దరూ తలలు పట్టుకున్నారు.

దాత ! దాత ! అంటుంటే ఇతనేదో దానధర్మాలు చేసే బాపతు అనుకునేరు . ఇతనొక రైతు. అందుకే అన్నదాతలో నుంచి దాతని తీసుకొని, అలా పిలుస్తుంటారు. ఈనాడులో వచ్చే అన్నదాత కార్యక్రమంతో వీడికి రోజు తెల్లవారుతుంది. అన్నదాత డైరీ కోసం ప్రతి యేడు చందా కూడా కడుతుంటాడు. అసలు పేరు వెంకటరావు . ఊరవతల నదికి ఆనుకొని అయిదు ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తుంటాడు. ఇది కాక ఊర్లో చిన్న చిన్న ఆస్తులు, సొంత ఇల్లు ఉన్నాయి. తమ్ముడిని బి.టెక్ చదివిస్తున్నాడు. వాడు తన లాగా వ్యవసాయం చేయకుండా మంచి ఉద్యోగం చేయాలని ,తమ్ముడి కంటే ఎక్కువగా తపిస్తూఉంటాడు.

“మీరు కూర్చొని ఉండండి నేను పని పూర్తి చేసుకుని పది నిముషాలలో వస్తాను” అని వెళ్ళాడు పొలంలోకి. చల్లని గాలి, చక్కని పాడి, చాకిరి ఎక్కువ ,కాలుష్యం తక్కువ, వీడి పని సుఖంరా, నాకన్నా ఇంకో ఇరవై సంవత్సరాలు ఖచ్చితంగా ఎక్కువ బతుకుతాడు” అన్నాడు అజయ్. “అదేంటిరా, అంత మాటనేశావు” అన్నాడు గుప్తా.

“ఈ సాఫ్ట్ వేర్ జాబులు, అందులో జబ్బులు అంతే కదరా! ముప్పై దాటకుండానే బి.పి.లు,షుగర్లు వస్తుంటేనూ” అన్నాడు అజయ్ ఇంకో సిగిరెట్ కాలుస్తూ. “ఇలా సిగిరెట్ మీద సిగిరెట్ తాగితే బిపి ఏమి ఖర్మ కాన్సర్ కూడా వస్తుంది !” అన్నాడు గుప్త.

“ఎన్ని సార్లు చెప్పానురా?” ఇక్కడ సిగిరెట్ తాగ వద్దు, పచ్చని పొలాలు పాడవుతాయని”, అన్నాడు దాత. పొలంలో నుంచి గుణపం తీసుకొని లోపల పెడుతూ “ఇక్కడికొచ్చేదే సిగిరెట్ తాగటానికి అదే వద్దంటే ఎలా?” అన్నాడు అజయ్. “వీడు కాల్చే అర పెట్టెకి నీ అయిదెకరాలు తగలబడవులేరా” అన్నాడు గుప్తా. “ఇంతకి ఏంటి అజయ్ ఉన్న పళంగా ఊడి పడ్డావు ? ఆ ఊరు పొమ్మన్నదా ? ఈ ఊరికాడె రమ్మన్నదా ?” అన్నాడు ప్రాస కోసం ప్రయత్నిస్తూ. “నీకో దండంరా బాబు, మరీ అంత తెలుగు మాట్లాడకురా ! మా ఆరోగ్యాలకు అంత మంచిది కాదు. సెలవలు చాలా ఉన్నాయి, అందుకే వచ్చాను” అన్నాడు అజయ్.

“ఇంతకీ అక్కడ అమ్మాయిలంతా ఎలా ఉన్నారు?” అని అజయ్ ని అడిగాడు వెంకటరావు. “ఏ అమ్మాయిలు?” అడిగాడు అజయ్. మీ హైటెక్ అమ్మాయిలు బావా. మాకంటే ఆవులు, అప్పులు తప్ప అమ్మాయిలు తెలియదు. నీకు అంతా రంగులే కదా! ఎన్ని సినిమాల్లో చూడలేదు? వీకెండ్ వస్తే ఎండ్ లేని ఆనందం, లేస్తే పబ్, లేకపోతే క్లబ్” అని వెటకారంగా అన్నాడు. “ఇవన్నీ సినిమాల్లో తప్ప నిజంగా ఉండవని లక్ష సార్లు చెప్పినా వినరే?” అని అజయ్ కొంత అసహనం ప్రదర్శించాడు. ఈ లోగా వెంకటరావు అక్కడున్న కూరగాయలు మొక్కలకి నీళ్ళు పెట్టే పనిలో నిమగ్నమయ్యాడు.

[తరువాయి భాగం వచ్చే వారం]

For Latest Telugu Books - Visit now:
Kinige
.com